క్లుప్తంగా

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

షాద్‌నగర్: పట్టణంలోని రవీంద్రభారతీ పాఠశాలలో శుక్రవారం గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సతీశ్ మాట్లాడుతూ పిల్లలకు తల్లిదండ్రులు మొదటి గురువులన్నారు. వారు చెప్పిన విషయాలను శ్రద్ధగా విని ఆచరించాలని చెప్పారు. ప్రతీ విద్యార్థి తల్లిదండ్రులను గౌరవించాలని, వారి ఆలోచనలకు అనుగుణంగా పిల్లలు నడుచుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో విద్యార్థుల భవిష్యత్తు ఆనందమయంగా ఉంటుందని సతీశ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోండి



ఏఈకి వినతి పత్రం ఇస్తున్న సర్పంచ్ రాములు

శంకర్‌పల్లి: మాసానిగూడ విద్యుత్ లైన్‌మెన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామస్తులతో కలిసి శంకర్‌పల్లి విద్యుత్ శాఖ ఏఈ ప్రదీప్ వర్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో నూతన విద్యుత్ మీటర్లు ఇప్పిస్తానని చెప్పి 25మంది దగ్గర డబ్బులు వసూలు చేసి మీటర్లను ఇప్పించలేదన్నారు. విద్యుత్ బిల్లులు వసూలు చేసుకొని రసీదు కూడా ఇవ్వడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా పెంటనోళ్ల నర్సింహ్మా



నియామక పత్రం అందుకుంటున్న నర్సింహ్మా

షాద్‌నగర్‌రూరల్: వాడ్యాల వసంతరెడ్డి ఫంక్షన్ హాల్లో శుక్రవారం మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్ ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పెంటనోళ్ల నర్సింహ్మా, ఉపాధ్యక్షుడిగా కిరణ్, ప్రవీణ్, అధికార ప్రతినిధిగా కృష్ణమాదిగ, ప్రధాన కార్యదర్శిగా గ్యారసురేశ్, కార్యదర్శులుగా కిరణ్‌పూలే, గ్యారసుదర్శన్, శివశంకర్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. మదిలేటి, శంకర్‌రావు, రమేశ్, బుగ్గరాందర్, చిన్నోళ్లఅనంతయ్య, చిరంజీవి, అశోక్, బాలరాజ్, ఆనంద్, లక్ష్మయ్య, శ్రీను, మహేందర్, వినోద్, సురేశ్ పాల్గొన్నారు.

శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు

చేవెళ్ల: మండలంలోని పలు ఆలయాల్లో శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలతో ఆలయాలు సందడిగా మారాయి. శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అమ్మవారికి భక్తులు గాజులతో అలకంరించి సుమంగళి పూజ చేశారు.

కుల వృత్తులకు జీవం

- సీఎం కేసీఆర్‌తోనే ఇది సాధ్యమైంది
- బీఆర్‌ఎస్‌ను మరోసారి ఆశీర్వదించండి
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- గొల్ల కురుమలకు జీవాల పంపిణీ



శంకర్‌పల్లి: గొల్ల కురుమలకు గొర్రెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: గొల్ల కురుమల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. టంగటూరు గ్రామంలో శుక్రవారం సర్పంచ్ గోపాల్ గొల్ల కురుమలకు రెండో విడత గొర్రెలను లబ్ధిదారులకు 18యూనిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం అన్ని కుల వృత్తులను ప్రోత్సహిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశ పెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. దేశంలోని పేదలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పథకాల వైపు చూస్తున్నారన్నారు. ప్రతీ ఇంటికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందజేస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం కేసీఆర్ నాయకత్వంలో మరోసారి బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపారావు, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కావలి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: గొర్రెలు, మేకల పెంపకంలో కాపరులు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని మండల పశువైద్యాధికారి స్ఫూర్తి తెలిపారు. తీగాపూర్ గ్రామంలో రెండో విడత గొర్రెల పంపిణీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ గ్రామంలోని మల్లికార్జున గొర్రెల పెంపకందారుల సంఘంలోని 24మందికి కొనుగోలు కోసం తమ వాటా సొమ్మును ప్రభుత్వానికి చెల్లించారన్నారు. రెండో విడతలో 6గురికి 6యూనిట్ల చొప్పున 126గొర్రెలు పంపిణీ చేశారన్నారు. ఇతర ప్రాంతాల నుంచి తెచ్చే గొర్రెలను కొన్ని రోజుల వరకు జాగ్రత్తగా పరిశీలించాలని కాపరులకు ఆమె సలహాఇచ్చారు. స్థానిక వాతావరణం అలవాటు పడే వరకు తరచూ వైద్య పరీక్షలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు సాయన్న, రమేశ్, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.



పంపిణీ చేసిన గొర్రెలు

అవినీతి పాలనకు చరమగీతం

- పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్
- మూడెకరాల పంపిణీ ఏమైంది
- బీఆర్‌ఎస్, బీజేపీ రెండు ఒక్కటే



మాట్లాడుతున్న శంకర్

షాద్‌నగర్: సీఎం కేసీఆర్ మాయమాటలను జనం నమ్మరని, అవినీతి పాలనకు చరమగీతం పాడేరోజులు దగ్గర్లో ఉన్నాయని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కడియాలకుంటలో మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ, లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అఖండ విజయం సాధించడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ రెండు ఒక్కటేనని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతూ రాజకీయ లబ్ధిపొందేందుకు ప్రయత్నిస్తుందన్నారు. రాహుల్ గాంధీ ప్రజలతో మమేకమై అందరిని ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. భారత్ జోడో యాత్రతో అందరిలో విశ్వాసం, నమ్మకం పెరిగిందన్నారు. అధికారంలోకొచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. దళితుడిని సీఎం చేస్తామని, మూడెకరాల భూమిని పంపిణీ చేస్తామని, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదన్నారు. కేసీఆర్ ఉత్తుత్తి వాగ్దానాలను గుప్పిస్తు ఎన్నికల్లో లాభపడాలని పన్నాగం వేశారని విమర్శించారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకపోయిందన్నారు. ప్రజా వ్యతిరేఖ విధానాలు చేపడుతున్న బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలను వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బాబర్‌ఖాన్, బాల్‌రాజ్‌గౌడ్, రఘు, శ్రీనివాస్‌రెడ్డి, అనంతం, శ్రీను నాయక్, తులసీరాం నాయక్, సక్రూ, చంద్రశేఖర్, బసప్ప, నాగి సాయిలు, రాములు, రమేశ్, వెంకటేశ్, భూపాల్, కమ్మరి నర్సింహులు, మాధవరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, రాజు, సూర్యా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయండి

జిల్లేడ్ చౌదరిగూడ అధ్యక్షుడు సయ్యద్ హాఫీజ్

కొందుర్గు: గ్రామాల్లో పార్టీ పటిష్టతకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని బీఆర్‌ఎస్ జిల్లేడ్ చౌదరిగూడ మండల అధ్యక్షుడు సయ్యద్ హాఫీజ్ అన్నారు. చింతకుంటతండా, ముష్టిపల్లి, ఎదిర, కాసులబాద్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేరవేసిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. మరోసారి తమ పార్టీని ఆదరించి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాములు, జబ్బార్, వెంకటేశ్, బాబురావు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సమావేశం..

విశ్వనాథ్‌పూర్, చెర్కుపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ సమాశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, రామకృష్ణ, రామచంద్రయ్య, రామకృష్ణా రెడ్డి, మాచి రెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ హాఫీజ్

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులకు అన్నదానం చేస్తున్న నవీన్‌కుమార్

వాసవి క్లబ్ అధ్యక్షుడు గార్లపాటి నవీన్‌కుమార్

షాద్‌నగర్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని వాసవి క్లబ్ అధ్యక్షుడు గార్లపాటి నవీన్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా అండర్ 14, 17 విభాగంలో ఖోఖో, అండర్ 14, 17 విభాగంలో బాలురకు క్రికెట్, బాలబాలికలకు లాంగ్ జంప్, షాట్‌పుట్, పరుగుపందెం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడల్లో పాల్గొన్న వారికి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని క్లబ్ అధ్యక్షుడు గార్లపాటి నవీన్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమన్నారు. విద్యార్థులు తమలోని ప్రతిభను ప్రదర్శించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. ఓడిపోయిన వారు నిరుత్సాహ పడకుండా మరింత పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ వెంకటరమణ, కోశాధికారి వినోద్‌కుమార్, సూరిశెట్టి నర్సింహ్మ గుప్తా, బాలరాజేశ్, శ్రీనివాస్, పెద్దిరాం మోహన్, త్రినాథ్, తాటి రాంచంద్రుడు, బుచ్చిరాములు, తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌రూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి అన్నారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ జోనల్ సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగంలో విద్యార్థులకు ఖోఖో, క్రికెట్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. విజేతలకు వెంకట్‌రాంరెడ్డి, ఎంఈఓ శంకర్‌రాథోడ్ బహుమతులు అందజేసి జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. పీఈటీలు ఎజ్కేల్, నిర్మల, యాదయ్య, వరలక్ష్మి, స్వాములు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కేశంపేట: మండలంలో వివిధ గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శనివారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పంపిణీ చేస్తారని తహసీల్దార్ అజీంఅలీ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. 48 మందికి చెక్కులు మంజూరైనట్లు అజీంఅలీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులతో పాటు లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

11న ద్విగళావధానం

షాద్‌నగర్: శ్రీ కళామంజరి సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఠాగూర్ పాఠశాలలో 11న ద్విగళావధానం నిర్వహిస్తున్నట్లు సంస్థ గౌరవ అధ్యక్షుడు బండారి రమేశ్, కరస్పాండెంట్ రాజేంద్ర ప్రసాద్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవధాన కళానిధి, శతావధాని ఆముదాల మురళీ అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం 2గంటలకు నిర్వహిస్తారని వారు తెలిపారు. సునరాపు చంద్రశేఖర శర్మ, రంప సాయికుమార్ శర్మలు ద్విగళావధానం చేయనున్నట్లు పేర్కొన్నారు. సాహిత్య అభిమానులు, కవులు, సాహితీవేత్తలు ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని వారు కోరారు.

దశలవారీగా గ్రామాభివృద్ధి

మోత్కుపల్లి సర్పంచ్ రత్నం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ రత్నం

మొయినాబాద్: దశలవారీగా గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నామని మోత్కుపల్లి సర్పంచ్ రత్నం అన్నారు. మోత్కుపల్లిలో మండల పరిషత్ నిధులతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను స్థానిక ఎంపీటీసీ మోర శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నామన్నారు. ఇప్పటికే అన్ని బస్తీల్లో పనులు చేపట్టామని మిగిలిపోయిన పనులు త్వరలోనే పూర్తి చేయిస్తామన్నారు. గ్రామస్తులు కూడా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సర్పంచ్ రత్నం కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కిరణ్, కోఆప్షన్ మెంబర్ శేఖర్, రాజశేఖర్, చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని వినతి

ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి

షాద్‌నగర్‌రూరల్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి అన్నారు. వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సీడీపీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న టీచర్లకు, ఆయాలకు సరైన వేతనాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అంగన్‌వాడీ టీచర్లు 40 సంవత్సరాల క్రితం రూ.200ల వేతనంతో పని చేశారని గుర్తు చేశారు. చాలీచాలని వేతనాలతో అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు ఈఎస్‌ఐ, పీఎఫ్‌వంటి సౌకర్యాలు లేవని, కనీస వేతనం కింద వారికి రూ. 21వేలు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీల డిమాండ్ల సాధనకు 11నుంచి సమ్మె చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, అంగన్‌వాడీ మండల అధ్యక్షురాలు యామిని, కార్యదర్శి సువర్ణ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నాణ్యమైన విత్తనాలతో మేలు



గిఫ్ట్ అందజేస్తున్న మేనేజర్ పాండు

చేవెళ్ల: నాణ్యమైన విత్తనాల వాడకంతో రైతులకు అధిక దిగుబడితో పాటు లాభాలు వస్తాయని అజిత్ సీడ్స్ కంపెనీ జోనల్ మేనేజర్ పుప్పాల పాండు అన్నారు. జాలగూడ గ్రామంలో శుక్రవారం రైతులు సాగు చేసిన పంటలను ఆయన పరిశీలించారు. జాలగూడ, గుండాల, చనువెల్లి, లక్ష్మిగూడెం, అల్లావాడ, ఎర్నో కోటల, దేవునిఎర్రవల్లి, మామిడిపల్లి తదితర గ్రామాల రైతులకు నిర్వహించిన అవగాహన సదసులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అజిత్ రెడ్ బాల్ సీడ్'తో మంచి దిగుబడులు వస్తున్నాయని చెప్పారు. ఈ కంపెనీ అందిస్తున్న బీట్‌రూట్ పంటల సాగును పరిశీలించారు. పంట ఎదుగుదల బాగుందని రైతులు ఆయనతో చెప్పారు. 30ఏళ్ల నుంచి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తున్నామని పాండు తెలిపారు. రైతులు పంట మార్పిడి విధానం తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు. అనంతరం రైతు బాలయ్య మాట్లాడుతూ అజిత్ రెడ్ బాల్ బీట్‌రూట్ విత్తనాలు రోగాలను తట్టుకొని అధిక దిగుబడి నిస్తుందన్నారు. రైతులకు పంటల విషయంలో ఏమైన సహాయ సహకారం అవసరమైతే అందుబాటులో ఉన్న వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, సాయి, చేవెళ్ల, నాగరగూడకు చెందిన సీడ్స్ డీలర్లు, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని నాగర్‌గూడ శ్రీకృష్ణ దేవాలయ నిర్వాహకులు తాళ్ల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం నాగర్‌గూడ శ్రీకృష్ణ దేవాలయంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఉట్లు కొట్టి, అర్చన, హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు దైవాన్ని పూజిస్తే ఆటంకాలు కలగవని ప్రశాంతంగా ఉండొచ్చన్నారు. తాళ్లపల్లి, తిమ్మారెడ్డిగూడ, పోతుగల్, రుద్రారం, చందనవెల్లి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

చిన్న సోలీపేట్‌లో...

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని చిన్న సోలీపేట్ సర్పంచ్ రమ్యకృష్ణ, ఎంపీటీసీ లత పేర్కొన్నారు. చిన్న సోలీపేట్ గ్రామంలోని శ్రీకృష్ణాదేవాలయంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రిపూట శ్రీ భగవాన్ శ్రీకృష్ణా నామ సంకీర్తన, భజన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతీ ఒక్కరు ఉల్లాసంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాంచంద్రారెడ్డి, మహిపాల్‌రెడ్డి, కావలి గోపాల్, శేకర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌రూరల్: శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు

షాద్‌నగర్‌రూరల్‌లో..

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలో భాగ్యనగర్‌కాలనీలోని క్రిష్ణవేణి ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ రఫత్‌సుల్తానా ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చూపరులను ఆకట్టుకున్నారు. విద్యార్థులు ఉట్టికొట్టి ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. అనంతరం రఫత్‌సుల్తానా మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఇతిహాసాలను చదివి అవగాహన చేసుకోవాలన్నారు. గీతా సారాంశం మనకు అనేక ధర్మాలను చెబుతుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



చేవెళ్ల: మాట్లాడుతున్న సర్పంచ్ శైలజ

మొయినాబాద్‌రూరల్: మహిళలు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ల మండల కార్యదర్శి కవిత, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మిలు పేర్కొన్నారు. శుక్రవారం హిమాయత్‌నగర్ గ్రామంలో పోషకాహారంపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎదిగే పిల్లలకు ప్రతీ రోజు బలవర్ధకమైన ఆహారం ఇవ్వాలన్నారు. ప్రొటీన్లు, విటమిన్లు కలిగిన ఆహారం ఇవ్వడం వల్ల బలంగా, ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. పిల్లలకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారంతో పాటు గుడ్లు, పాలు ఇస్తున్నామన్నారు. ప్రధానోపాధ్యాయురాలు మెహరున్నీసా బేగం, ఉపాధ్యాయురాలు కవిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తూంపల్లిలో పోషణ మాసోత్సవాలు

కొందుర్గు: చెక్కలోనిగూడ, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని తూంపల్లి అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో లభించే కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు ప్రదర్శించారు. భాగ్యమ్మ, సంగీత, పాల్గొన్నారు.

చేవెళ్ల: చిన్నపిల్లల ఎదుగుదలకు పోషకాహారం అవసరమని చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజ అన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సూపర్‌వైజర్ లక్ష్మి ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాన్ని నిర్వహించారు. సర్పంచ్ శైలజతోపాటు డాక్టర్ శ్రావణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖాజాపాషలు పోషక ఆహారం, విలువల గురించి మాట్లాడారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న కాలనీవాసులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని మధురానగర్‌లో ప్రజా ప్రయోజనార్థం వదిలిన ఖాళీ స్థలంలో కొందరు వ్యక్తు లు ప్రహరీ గోడ నిర్మిస్తుండగా కాలనీవాసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ 200 గజాల పార్కు స్థలంలో గతంలో గ్రామ పంచాయితీ పాలకవర్గం ప్రజల అవసరాల కొరకు మంచినీటి బోరును కూడ వేయించిందని గుర్తుచేశారు. తప్పుడు పత్రాలతో స్థలాన్ని కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ అధికారులు జోక్యంతో పనులను నిలిపేశారు. అధికారులు వెంటనే స్పందించి కబ్జాకు యత్నిస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకుని పార్కు స్థలాన్ని పరిరక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ

ఆమనగల్లు: ఆమనగల్లు బీఆర్‌ఎస్ నాయకుడు గుత్తి బాలస్వామిని శుక్రవారం పలువురు పరామర్శించారు. ఇటీవల దాడిలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ జంగయ్య, మాజీ సర్పంచ్ కేశవులు, చేనేత సంఘం మాజీ అధ్యక్షుడు కృష్ణయ్య, సాయిలు, మల్లేశ్‌నాయక్, వెంకటయ్య పరామర్శించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

కేశంపేట: కొత్తపేట గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఇద్దరిని పలువురు సన్మానించారు. పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాససాగర్, శశికళ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై న సందర్భంగా శుక్రవారం సర్పంచ్ కమ్మెకర్ నవీన్‌కుమార్, ఎంపీటీసీ మల్లేశ్‌యాదవ్‌తో పాటు ఇన్‌చార్జి మండల విద్యాధికారి మనోహర్ పూలమాలలు వేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ కుమ్మరి యాదయ్య, జగన్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజానికి అనుగుణంగా బోధన : ఎంపీపీ

షాబాద్: సమాజానికి అనుగుణంగా ఉపాధ్యాయుల బోధన ఉండాలని షాబాద్ ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్తు కార్యాలయంలో కృష్ణకుమారి, సునీత, సరోజ, విమల, డాక్టర్ వాచ, జయశ్రీ, మాలతి, మండల స్థాయిలో15 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతీ మనిషికి తల్లి, దండ్రులు మొదటి గురువు అయితే, జీవితాన్ని తీర్చిదిద్దే ఉపాధ్యాయులు రెండో గురువు అని అన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి, సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యాబోధన చేయాలన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనన్నారు. అజ్ఞాన అంధకారాన్ని పారద్రోలి, జ్ఞానజ్యోతిని వెలిగించేవారు ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శంకర్‌రాథోడ్, పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు సుదర్శన్, కృష్ణ, గౌరవ అధ్యక్షుడు యాదయ్య, రాష్ట్ర బాధ్యులు డేవిడ్‌రెడ్డి, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు శ్రీనివాస్, విజయలక్ష్మి, ఝాన్సీ, జంగయ్య, నాగిరెడ్డి, నర్సింహులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ



షాబాద్: సన్మానిస్తున్న ఎంపీపీ